క్లుప్తంగా

ప్రజల సహకారంతోనే కలపాక అభివృద్ధి



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ కనకారావు, పాల్గొన్న ప్రజలు

పరవాడ: ప్రజల సహకారంతోనే మరింతగా కలపాక గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని సర్పంచ్ బొండా కనకారావు అన్నారు. కలపాక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత గ్రామ సభలో తీర్మానించిన అభివృద్ధి పనులు, కార్యక్రమాల పురోగతిని ప్రజలకు వివరించారు. గ్రామ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించామని వాటిని పరిశీలించిన అనంతరం విడతల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సభలో పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, ఎంపీటీసీ సప్పా ప్రభ సన్యాసిరావు, ఉప సర్పంచ్ బొండా సరోజిని, వార్డు సభ్యులు అక్కిరెడ్డి శ్రీనివాసరావు, కె.తలుపులమ్మ, ఇందల అశోక్, కొండలరావు, గొర్లి శ్రీను, వనుము శ్రీను, ప్రజలు పాల్గొన్నారు.

దీపాంజలినగర్లో కుక్కల బెడద



ప్రధాన గేట్ ఎదురుగానున్న రోడ్డుపై సంచరిస్తున్న వీధి కుక్కలు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు దీపాంజలి నగర్‌లో వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడి దీపాంజలినగర్ టౌన్‌షిప్ ప్రధాన ద్వారం వద్ద నిత్యం రోడ్డుపై పదుల సంఖ్యలో సంచరిస్తున్న గ్రామ సింహాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రధాన ద్వారం ఎదుటే రోడ్డుపై నిద్రిస్తూ, రాత్రి సమయంలో వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న కార్మికులు, ఉద్యోగులు, ప్రయాణికులపై దాడులకు పాల్పడున్నాయి. వేకువ జామున వాహనాలపై ప్రయాణాలు సాగించే వారి వెంట పరుగులు తీస్తూ వారిని భయపెడుతూ, ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. స్థానికంగా మాంసం, చేపల దుకాణాల్లో మిగిలిన వ్యర్థాలను కాలువల్లో, ఆరుబయట వేయడంతో వాటిని తింటూ అక్కడే తిష్ట వేస్తున్నాయి. వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పగల్‌పత్తు తిరువీధి



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి విశేషంగా తిరువీధి జరిగింది. తెల్లవారుజామున స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పల్లకిపై అధిష్ఠింపజేశారు. ఆలయ బేడామండపంలో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. షోడషోపచార పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 8 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.80 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింహరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి ఈ మేరకు తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రోడ్డుకు ఇరువైపులా చెత్తే

ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దీంతో నిత్యం అవస్థలు పడుతున్నట్లు మత్స్యకారులు వాపోతున్నారు. చెత్త కుప్పల కారణంగా దోమలు విజృంభించి, రాత్రి సమయంలో కంటి మీద కునుకు లేకుండా పోతోందని వాపోతున్నారు.



కొరవడిన చెత్త 'శుద్ధి'

పరవాడలో పైడిమాంబ ఆలయం, వినాయక ఆలయాల వద్ద స్థానికులు, వ్యాపారుల్లో కనీస స్పృహ లేదు. ప్లాస్టిక్ గ్లాసులు, సంచులు, ఇళ్లలో చెత్తాచెదారాన్ని రోడ్ల పక్కనే పడేస్తున్నారు. దీంతో రోడ్డు మీదుగా వెళ్లే వాహనదారులతోపాటు, ఆలయాలకు వచ్చే భక్తులు తీవ్ర అవసౌకర్యానికి గురవుతున్నారు.



స్వచ్ఛతా నహీ సేవ



వాడచీపురుపల్లి మెయిన్ రోడ్డులో డస్ట్‌బిన్ వద్ద పేరుకుపోయిన చెత్త

స్వచ్ఛ భారత్ మిషన్ దశాబ్ది వేడుకల్లో భాగంగా గతేడాది సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఊరూవాడా ఊదరగొట్టారు. ఫొటోలకు ఫోజులిచ్చి మమ అనిపించారు. ఆ తర్వాత దానిపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. కేంద్రం తలపెట్టిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో పడకేశాయి. దీంతో పల్లె ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పరవాడ మండల గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలే ఇందుకు నిదర్శనం.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం | రోజుల తరబడి పోగవుతున్న చెత్త | తరలించడంలో సిబ్బంది నిర్లక్ష్యం | కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పరవాడ: మండలంలోని పల్లెల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది సకాలంలో తొలగించట్లేదు. చాలా చోట్ల వీధులు, కూడళ్లలో డస్ట్‌బిన్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలు తమ ఇళ్లలో పోగైన వ్యర్థాలను తీసుకువచ్చి రోడ్ల పక్కన పడేస్తున్నారు. చెత్త కుండీల్లోని చెత్తను కూడా ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో వాటి పక్కనే చెత్తాచెదారం పోగవుతోంది. దీంతో పల్లె ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

దుర్వాసన.. దోమల వ్యాప్తి

పోగైన చెత్తను పారిశుధ్య సిబ్బంది సకాలంలో తొలగించని కారణంగా భరించలేని దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. వీటి బారిన పడి ప్రజలు రోగాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. వాడచీపురుపల్లి మెయిన్ రోడ్డు, నేస్తాలమ్మ సతకంపట్టు వద్ద ఏర్పాటు చేసిన చెత్త కుండీలు పూర్తిగా నిండిపోవడంతో స్థానికులు చెత్తను రోడ్డుపైనే వేస్తున్నారు. ఈ చెత్తను పందులు, కుక్కలు, కోళ్లు చెల్లాచెదురు చేస్తున్నాయి. కుండీలోని చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో నానా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెప్పున్నారు. చెత్త కుండీల్లో పేరుకుపోతున్న చెత్తను రోజు తప్పించి రోజైనా తొలగించట్లేదని స్థానికులు వాపోతున్నారు.



వాడచీపురుపల్లి నేస్తాలమ్మ సతకంపట్టు వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలు

భరించలేని దుర్వాసన



వాడచీపురుపల్లి మెయిన్‌రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన చెత్త కుండీ నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నాం. చెత్త కుండీలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించట్లేదు. దీంతో కుండీ నుంచి దుర్వాసన వస్తోంది. పక్కనే నివాసం ఉంటున్న మేం ఆ దుర్గంధం భరించలేక నానా ఇబ్బందులు పడుతున్నాం. చెత్తను సకాలంలో తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎ.ఆదినారాయణరెడ్డి, వాడచీపురుపల్లి

ఏళ్ల తరబడి పోగైన చెత్త



దిబ్బపాలెం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని ఏళ్ల తరబడి తొలగించట్లేదు. దీంతో దోమలు వ్యాప్తి చెంది, రాత్రి సమయంలో కంటి నిండా నిద్ర లేకుండా చేస్తున్నాయి. గ్రామస్తులు రోడ్డుకు ఇరువైపులా చెత్తను పోగేయడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. చెత్త కుప్పల్ని తొలగించేందుకు పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకోవట్లేదు.

– బంగారమ్మ, దిబ్బపాలెం

చెత్త కుండీలు పెట్టండి



గ్రామ వీధుల్లో చెత్త కుండీలు లేని కారణంగా ప్రజలు ఇళ్లలోని చెత్త చెదారాన్ని ఎక్కడికక్కడ రోడ్ల పక్కనే వేస్తున్నారు. వీధులు, గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇళ్లలో తడి, పొడి చెత్త విభజనకు అవసరమైన మినీ డస్ట్ బిన్‌లను ప్రజలకు పంపిణీ చేయాలి. డస్ట్‌బిన్‌లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– ఎలమంచిలి కనకరత్నం, వెన్నలపాలెం

రోడ్లపైనే చెత్త

గొర్లివానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నలుగురూ నడిచే రోడ్లే చెత్తకు ఆవాసాలుగా మారాయి. ఏ రోజు చెత్త ఆ రోజు కాదు కదా.. కనీసం వారంలో ఓసారి కూడా తరలించట్లేదు. దీంతో ఎండకు ఎండి, వానకు తడిచి, చెల్లాచెదురై దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.



అంతా అపరిశుభ్రం

వెన్నలపాలెంలో ఎక్కడపడితే అక్కడ రోడ్లు, పాఠశాలలు అని చూడకుండా ఇష్టానుసారంగా చెత్తను పోగులేస్తున్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలు చదువుకునే పాఠశాల పరిసరాలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయట్లేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.



ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సత్కారం అందుకున్న మహిళా అధ్యాపకులతో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సిబ్బంది

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాలలోని మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. అధ్యాపకులు ఎం.నాగమణి, యు.జయలక్ష్మి, వై.శ్వేత, సీహెచ్ ఆశారాణి, ఎన్.సౌజన్య, కె.వి.రత్నం, బి.సౌజన్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్బవరం గురుకుల పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సబ్బవరం: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జీవిత విశేషాలను, మహిళల విద్యాభివృద్ధికి ఆమె అందించిన సేవలను వివరించారు.

చండీగఢ్ విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణపై నిరసన

పరవాడ: చండీగఢ్‌విద్యుత్ పంపిణీ సంస్థ ప్రైవేటీకరణను వెంటనే ఉపసంహరించాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సింహాద్రి ఎన్టీపీసీ ప్రధాన గేటు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రైవేటీకరణపై చండీగఢ్ ప్రజలకు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. హర్యానా-చండీగఢ్ రాష్ట్రాలకు లాభాలను ఆర్జించి పెడుతున్న చండీగఢ్ ఎలక్ట్రిసిటీ బోర్డు 2019-22లో రూ.261 కోట్ల లాభాలు ఆర్జించి పెట్టిందన్నారు. ఆ ప్రాంత ప్రజలకు కారుచౌకగా యూనిట్‌ను రూ.4.50కు సరఫరా చేస్తోందన్నారు. అలాంటి విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ చేసి, మోదీ ప్రభుత్వం కార్పొరేట్ యాజమాన్యాలకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు కార్మికవర్గం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి.పి.నాయుడు, పి.గోవిందరాజులు పాల్గొన్నారు.



ఎన్టీపీసీ సింహాద్రి గేటు ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ప్రమాదమని తెలిసీ.. పట్టించుకోరు!

పరవాడ: ఆటోలు, మినీ వ్యాన్ల యాజమానులు ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. తమ ఇష్టానుసారంగా ప్రయాణికులను తమ వాహనాల్లో ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఆటోలు, మినీ వ్యాన్లలో సిటింగ్‌కు మించి ప్రయాణికులను తీసుకెళ్లడం రివాజుగా మారింది. ఎన్టీపీసీ, ఫార్మా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, రోజువారీ కూలీలకు ఆటోలు, మినీ వ్యానులే దిక్కు. పరిశ్రమల యాజమాన్యాల వద్ద కూలి పనులను ఒప్పందం చేసుకున్న కాంట్రాక్టర్లు కాంట్రాక్టు పద్ధతిపై ఆటోలు, మినీవ్యాన్లను వెంటబెట్టుకుని కూలీలను పరిశ్రమల వద్దకు తరలిస్తారు. రెండు మూడు పర్యాయాలు వాహనాల తిప్పడం ద్వారా అధిక వ్యయం అవుతుందన్న ఉద్దేశంతో కూలీలందరినీ ఒకేసారి పంపించేందుకు ఆటోలు, మినీ వ్యాన్లలో కిక్కిరిసేలా ఎక్కిస్తున్నారు. చాలాసార్లు సరకు రవాణాకు వినియోగించే వ్యాన్లలో నిల్చునే కూలీలు పనిలోకి వెళ్తున్నారు. నిత్యం ఇదే తీరు. పరిశ్రమలకు నిర్ణీత సమయాలకు వెళ్లాలనే వేగంలో ప్రమాదాలకు అవకాశాలున్నా యాజమాన్యాలకు పట్టట్లేదు. ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామర్థ్యానికి మించి ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సరకు రవాణా వ్యానులో కార్మికుల తరలింపు

గ్రావెల్ తవ్వకాలపై దాడులు.. పొక్లెయిన్ సీజ్

సబ్బవరం: మండలంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. శుక్రవారం జీవీఎంసీ పరిధి గంగవరంలో గ్రావెల్ తవ్వకాలపై విజిలెన్స్ ఏడీ బి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన రామునాయుడి పొక్లెయిన్‌ను సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఏడీ తెలిపారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



గంగవరంలో అధికారులు సీజ్ చేసిన పొక్లెయిన్

పక్కాగా పశుగణన



పాడిరైతులతో మాట్లాడుతున్న డీడీ డాక్టర్ చంద్రశేఖర్

సబ్బవరం: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మండలంలోని పశు సంవర్ధక శాఖ సిబ్బందితో శుక్రవారం సమీక్ష జరిపారు. సమావేశంలో రెగ్యులర్‌గా నిర్వహించే విధులు, ప్రస్తుతం అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై మాట్లాడారు. గోకులం, ఉపాధి హామీ పథకంలో చేపట్టే గడ్డి పెంపకం పశు కిసాన్ క్రెడిట్ కార్డుల గురించి ఆరా తీశారు. అనంతరం గతేడాది అక్టోబర్ 25 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకూ కొనసాగనున్న అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పశుగణన పక్కాగా పూర్తి చేయాలని సిబ్బందిని సూచించారు. సమావేశంలో సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు కె.ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన



సమావేశంలో సర్పంచ్ చంద్రవాణి, ఎంపీటీసీ స్వప్న

పెందుర్తి: మండలంలోని వాలిమెరక పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డు చంద్రవాణి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. చెత్తను తరలించి దాన్ని వర్మీ కంపోస్ట్‌గా తయారు చేసి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన నామమాత్రపు ధరకే అందిస్తున్నట్లు తెలిపారు. సీవైడీఏ బ్రాంచ్ హెడ్ ఎం.నాగేశ్వరరావు పలు అంశాలపై గ్రామస్తులకు సూచనలు, సలహాలు అందించారు. ఎంపీటీసీ సభ్యురాలు స్వప్న, గ్రామపెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష అభిషేకాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



వెంకన్నకు అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 19వ రోజైన శుక్రవారం వేంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుముర్రై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి జరిపారు. స్వామివారికి నైవేద్యం సమర్పించారు. 19వ పాశుర విన్నపం చేశారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు ఈవో వెల్లడించారు.

దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెందుర్తి: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి సీతారామారావు అన్నారు. వాలిమెరక పంచాయతీ పరిధి జుత్తాడలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. భూ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సకాలంలో మ్యుటేషన్, ఆన్‌లైన్ ప్రక్రియ, ఇతరత్ర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలని చెప్పారు. పలు భూ సమస్యలపై సర్పంచ్ బొడ్డు చంద్రవాణి అధికారులకు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ స్వప్న, నాయకులు బొడ్డు సూర్యప్రకాష్, గిరి, కునిగంటి కనకరాజు, వీఆర్వోలు, నాయకులు పాల్గొన్నారు.



సమస్యలపై ఎస్‌డీసీ సీతారామారావుకు వివరిస్తున్న సర్పంచ్ చంద్రవాణి ప్రకాష్

నేటి నుంచి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితతో పాటు స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో కరస్పాండెంట్ అదిరెడ్డి రమణ

సబ్బవరం: స్థానిక ప్రతిభ విద్యాలయం విద్యార్థులు 2వ ఓపెన్ డిస్ట్రిక్ట్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటారు. విశాఖలోని మురళీనగర్‌లో ఉన్న వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో గత నెల 15న జరిగిన పోటీల్లో 13 మంది విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ అదిరెడ్డి రమణ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన 9 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. గత నెల 28న విశాఖలో జరిగిన 2వ ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో పాఠశాలకు చెందిన జస్విత గెలుపొంది, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 18 నుంచి 21 వరకు అస్సాంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి స్కేటింగ్ 200 మీ, 400 మీ, వెయ్యి మీటర్ల రిలే పోటీల్లో ఎం.తిలక్, అంకుశ్ కుమార్, ఎం.జనప్రియ, సి.సహస్ర, ఎస్.కౌశల్, సి.జస్విత, ఎం.రామవర్షిత్, వి.మీనావర్ధన్, ఎం.లిషిచరణ్ పతకాలు సాధించినట్లు వెల్లడించారు.